భారత్ స్వర్ణ చరిత్ర

45వ చెస్ ఒలింపియాడ్‌లో డబుల్ ధమాకా

ఓపెన్, మహిళల విభాగాల్లో స్వర్ణాలు

బుడాపెస్ట్ (హంగేరి): ప్రతిష్టాత్మక చెస్ ఒలింపియాడ్‌లో భారత పురుషుల, మహిళల జట్లు సరికొత్త చరిత్రను లిఖించాయి. రెండు విభాగాల్లోనూ భారత్ అగ్రస్థానాన నిలిచి స్వర్ణాలు గెలుచుకుంది. బుడాపెస్ట్ వేదికగా జరిగిన 45వ చెస్ ఒలింపియాడ్ ఓపెన్ విభాగంలో దొమ్మరాజు గుకేశ్, ప్రజ్ఞానంద రమేశ్‌బాబు, విదిత్ గుజరాతితో పాటు తెలంగాణ యువ గ్రాండ్ మాస్టర్ అర్జున్ ఇరిగేసితో కూడిన భారత జట్టు 3.5-0.5తో స్లోవేనియాను ఓడించి స్వర్ణాన్ని కైవసం చేసుకుంది. యూఎస్ఏ, ఉజ్బెకిస్థాన్ రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. మహిళల విభాగంలో ద్రోణవల్లి హారిక, వైశాలి రమేశ్‌బాబు, దివ్య దేశ్‌ముఖ్, వంతిక అగర్వాల్ బృందం 3.5-0.5తో అజర్‌బైజాన్‌ను చిత్తు చేసింది. కజకిస్థాన్, యూఎస్ఏ రజతం, కాంస్యం గెలిచాయి. 97 ఏండ్ల ఈ టోర్నీ చరిత్రలో స్వర్ణం గెలవడం భారత్‌కు ఇదే ప్రథమం. మెన్స్ కేటగిరీలో 2014, 2022 ఎడిషన్లలో భారత్ కాంస్యం గెలవగా ఉమెన్స్ కేటగిరీలో 2022లో కాంస్యం దక్కడమే ఇప్పటిదాకా అత్యుత్తమ ప్రదర్శన. ఒక చెస్ ఒలింపియాడ్ ఈవెంట్‌లో ఒకే దేశానికి (ఓపెన్, ఉమెన్) రెండు స్వర్ణాలు రావడం ఈ టోర్నీ చరిత్రలో ఇది రెండోసారి మాత్రమే.

> అద్భుతమైన ఆటతీరుతో 45వ చెస్ ఒలింపియాడ్‌ను భారత్ కైవసం చేసుకుంది. సరికొత్త స్వర్ణ అధ్యాయాన్ని లిఖించిన భారత పురుషుల, మహిళల బృందానికి హ్యాట్సాఫ్! - కేటీఆర్

ఓటమన్నదే లేకుండా..

సుమారు 190 దేశాలు పోటీపడ్డ చెస్ ఒలింపియాడ్‌లో భాగంగా భారత్ అపజయమే లేకుండా టైటిల్‌ను గెలిచింది. 11 రౌండ్లు ఉండే ఈ టోర్నీలో భారత పురుషుల బృందం వరుసగా 8 రౌండ్లు గెలిచింది. 9వ రౌండ్‌ను (ఉజ్బెకిస్థాన్) డ్రా చేసుకోగా 10వ రౌండ్‌లో టాప్‌సీడ్ అమెరికాను ఓడించింది. 11 రౌండ్లకు గాను భారత్ ఖాతాలో 21 పాయింట్లు (రౌండ్‌కు 2) దక్కడం విశేషం. మహిళల జట్టూ వరుసగా 8 రౌండ్లు నెగ్గి 9వ రౌండ్‌ను డ్రా చేసుకుంది. తిరిగి 10, 11 రౌండ్లలో పైచేయి సాధించింది. 11 రౌండ్లలో అమ్మాయిలు 19 పాయింట్లు దక్కించుకున్నారు.

బంగ్లాపై భారీ విజయం

280 పరుగుల తేడాతో టీమ్‌ఇండియా గెలుపు • అశ్విన్ ఆల్‌రౌండ్ షో • సిరీస్‌లో 1-0 ఆధిక్యం

ప్రత్యర్థి ఎవరైనా సొంతగడ్డపై తమకు ఎదురులేదని భారత క్రికెట్ జట్టు మరోసారి నిరూపించింది. చెన్నై వేదికగా బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి టెస్టులో రోహిత్ సేన 280 పరుగులతో విజయదుందుభి మోగించింది. 515 పరుగుల ఛేదనలో బంగ్లా 234 పరుగులకే పోరాటాన్ని చాలించింది. ఆట మొదటి రోజు రెండు సెషన్లలో తడబడ్డా లోకల్ బాయ్ రవిచంద్రన్ అశ్విన్ వీరోచిత శతకానికి తోడు రవీంద్ర జడేజా నిలకడైన బ్యాటింగ్‌తో భారీ స్కోరు సాధించిన టీమ్‌ఇండియా.. ఆ తర్వాత ఎక్కడా ఆధిక్యాన్ని కోల్పోకుండా ఆధిపత్యం చెలాయించింది. నాలుగో ఇన్నింగ్స్‌లోనూ బంగ్లా పనిపట్టింది ఈ స్పిన్ ద్వయమే కావడం విశేషం. భారీ ఛేదనలో బంతి పేసర్లతో పాటు స్పిన్నర్లకూ అంతంత మాత్రంగానే అనుకూలించినా స్థానిక పరిస్థితులపై పూర్తిస్థాయి అవగాహన ఉన్న అశ్విన్.. ఆరు వికెట్లతో విజృంభించి బంగ్లాను చావుదెబ్బ కొట్టాడు. జడ్డూ కూడా తన స్పిన్ మాయతో ప్రత్యర్థి ఆట కట్టించడంతో భారత్ ఘన విజయాన్ని సొంతం చేసుకుంది.

అశ్విన్ (6/88)

చెన్నై: స్వదేశంలో బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి టెస్టులో భారత్ భారీ విజయం సొంతం చేసుకుంది. చెన్నైలోని చెపాక్ వేదికగా ఆదివారం ముగిసిన మ్యాచ్‌లో టీమ్‌ఇండియా 280 పరుగుల తేడాతో గెలిచి రెండు టెస్టుల సిరీస్‌లో 1-0 ఆధిక్యం సాధించింది. తొలి ఇన్నింగ్స్‌లో బ్యాట్‌తో సెంచరీ చేసిన రవిచంద్రన్ అశ్విన్.. రెండో ఇన్నింగ్స్‌లో బంతి (6/88)తో ఆరు వికెట్లు పడగొట్టి బంగ్లా పనిపట్టాడు. అశ్విన్‌కు తోడు అతడి సహచర స్పిన్నర్ రవీంద్ర జడేజా (3/58) రాణించడంతో 515 పరుగుల ఛేదనలో పర్యాటక జట్టు 234 పరుగులకే ఆలౌట్ అయి భారీ పరాభవాన్ని మూటగట్టుకుంది. భారీ ఛేదనలో ఆ జట్టు సారథి నజ్ముల్ హోసేన్ శాంతో (82) పోరాడినా అతడికి అండగా నిలిచే వారు కరువవడంతో బంగ్లాకు ఓటమి తప్పలేదు. మ్యాచ్‌లో ఆల్‌రౌండ్ షో తో అదరగొట్టిన రవిచంద్రన్ అశ్విన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. ఈ సిరీస్‌లో రెండో టెస్టు ఈనెల 27 నుంచి కాన్పూర్ వేదికగా జరుగనుంది.

రెండు గంటల్లోపే..

కొండంత లక్ష్యాన్ని కరిగించే క్రమంలో ఓవర్‌నైట్ స్కోరు 158/4 వద్ద నాలుగో రోజు ఆటను ఆరంభించిన బంగ్లా కనీస పోరాటం లేకుండానే రెండు గంటల్లోపే తోకముడిచింది. తొలి గంటలో శాంతో, షకిబ్ (25) కొంతసపు వికెట్లను కాపాడుకునే దశలో మరీ నెమ్మదిగా ఆడారు. కానీ డ్రింక్స్ తర్వాత కెప్టెన్ రోహిత్.. బంతిని అశ్విన్‌కు అందించడంతో బంగ్లా 'ఖేల్' ఖతం అయింది. అశ్విన్, జడ్డూ కలిసి 10 ఓవర్లలోనే మ్యాచ్‌ను ముగించారు. అశ్విన్ తన తొలి ఓవర్ (ఇన్నింగ్స్ 52వ)లోనే షకిబ్‌ను పెవిలియన్‌కు పంపాడు. స్లిప్స్‌లో యశస్వీ అద్భుత డైవ్ క్యాచ్ పట్టడంతో 48 పరుగుల ఐదో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. ఇక ఆ తర్వాత వచ్చినోళ్లెవరూ రెండంకెల స్కోరు కూడా చేయలేకపోయారు. జడ్డూ బౌలింగ్‌లో లిటన్ దాస్ (1) రోహిత్‌కు క్యాచ్ ఇవ్వగా బంగ్లా భారీ ఆశలు పెట్టుకున్న మెహిది హసన్ మిరాజ్ (8)ను అశ్విన్ ఔట్ చేసి రెండో ఇన్నింగ్స్‌లో 'ఫైఫర్'ను పూర్తిచేసుకున్నాడు. జడేజా వేసిన 63వ ఓవర్లో హసన్ మహ్మూద్ (7) క్లీన్ బౌల్డ్ అవడంతో బంగ్లా ఇన్నింగ్స్‌కు తెరపడింది.

సంక్షిప్త స్కోరు

భారత్: తొలి ఇన్నింగ్స్ - 376 ఆలౌట్,
బంగ్లాదేశ్: తొలి ఇన్నింగ్స్ - 149 ఆలౌట్,
భారత్: రెండో ఇన్నింగ్స్ - 287/4 డిక్లేర్డ్.
బంగ్లాదేశ్: రెండో ఇన్నింగ్స్ - 234 ఆలౌట్

రెండో టెస్టుకూ అదే జట్టు

బంగ్లాదేశ్‌తో కాన్పూర్ వేదికగా జరిగే రెండో టెస్టుకు భారత జట్టులో మార్పు లేమీ లేవు. తొలి టెస్టుకు ఎంపిక చేసిన జట్టు సభ్యులనే రెండో టెస్టులోనూ కొనసాగిస్తున్నట్టు ఆదివారం బీసీసీఐ ఒక ప్రకటనలో తెలిపింది.

భారత జట్టు: రోహిత్ శర్మ (కెప్టెన్), యశస్వీ జైస్వాల్, శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లీ, కెఎల్ రాహుల్, సర్ఫరాజ్ ఖాన్, రిషభ్ పంత్ (వికెట్ కీపర్), ధ్రువ్ జురెల్, రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, కుల్‌దీప్ యాదవ్, మహ్మద్ సిరాజ్, ఆకాశ్ దీప్, జస్‌ప్రీత్ బుమ్రా, యశ్ దయాల్

అశ్విన్ రికార్డుల మోత

1 రెండుసార్లూ ఒకే వేదికపై (టెస్టులలో) సెంచరీ చేసి ఐదు వికెట్లు తీసిన మొదటి ఆటగాడు. 2021లో ఇంగ్లండ్‌తో టెస్టులోనూ అతడు ఈ ఘనత సాధించాడు. అదీగాక ఒక టెస్టులో శతకంతో పాటు 'ఫైఫర్' సాధించిన ఆటగాళ్లలో ఇయాన్ బోథమ్ (5) తర్వాత రెండో స్థానంలో అశ్విన్ (4) నిలిచాడు.

2 టెస్టులలో అత్యధిక సార్లు (37) ఐదు వికెట్ల ఘనత సాధించిన రెండో బౌలర్. ఈ జాబితాలో ముత్తయ్య మురళీధరన్ (67) అందరికంటే ముందున్నాడు. ఈ క్రమంలో అతడు దివంగత షేన్ వార్న్ (37- ఆసీస్), రిచర్డ్ హ్యాడ్లీ (36- కివీస్)ను దాటేశాడు.

8 టెస్టులలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్లలో అశ్విన్ స్థానం. 522 వికెట్లతో అతడు 8వ స్థానంలో నిలిచాడు. విండీస్ దిగ్గజం కోర్ట్నీ వాల్ష్ (519)ను అధిగమించాడు.

టీమ్‌ఇండియా అరుదైన ఘనత

బంగ్లాదేశ్‌తో తొలి టెస్టు విజయం అనంతరం అంతర్జాతీయ క్రికెట్‌లో టీమ్‌ఇండియా అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. 92 ఏండ్ల భారత టెస్టు క్రికెట్ చరిత్రలో ఇప్పటిదాకా 580 టెస్టులు ఆడగా తొలిసారి ఓటముల కంటే విజయాల సంఖ్యను ఎక్కువగా నమోదుచేసింది. 580 టెస్టులలో 179 విజయాలు, 178 ఓటములు, 222 డ్రాలు చేసుకోగా ఒక మ్యాచ్ టై అయింది. ప్రపంచ క్రికెట్‌లో ఇలా అపజయాల కంటే విజయాలు ఎక్కువ నమోదుచేసిన దేశాలలో భారత్ నాలుగో స్థానంలో ఉంది.

అన్మోల్ ఖర్బ్‌కు రెండో టైటిల్

ఢిల్లీ: భారత బ్యాడ్మింటన్ యువ సంచలనం అన్మోల్ ఖర్బ్ మరోసారి సత్తా చాటింది. కొద్దిరోజుల క్రితమే 'బెల్జియం ఇంటర్నేషనల్'ను గెలుచుకున్న 17 ఏండ్ల ఈ అమ్మాయి.. ఆదివారం లుబ్లిన్ (పోలండ్) వేదికగా ముగిసిన 'పోలిష్ ఇంటర్నేషనల్ 2024' మహిళల సింగిల్స్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఫైనల్‌లో అన్మోల్.. 21-12, 21-8తో మిలెనా (స్విట్జర్లాండ్)ను ఓడించి వరుసగా రెండో టైటిల్ నెగ్గింది.

2 వికెట్లా? 68 పరుగులా?

గాలె: శ్రీలంక, న్యూజిలాండ్ మధ్య గాలె వేదికగా జరుగుతున్న తొలి టెస్టు రసవత్తరంగా సాగుతోంది. 275 పరుగుల ఛేదనలో భాగంగా రెండో ఇన్నింగ్స్‌లో నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి కివీస్ 207/8గా నిలిచింది. ఆ జట్టు విజయానికి మరో 68 పరుగులు అవసరముండగా క్రీజులో రచిన్ రవీంద్ర (91 నాటౌట్), అజాజ్ పటేల్ (0 నాటౌట్) ఉన్నారు. లంక విజయానికి రెండు వికెట్ల దూరంలో ఉంది.

దులీప్ ట్రోఫీ విజేత ఇండియా 'ఏ'

అనంతపూర్: దేశవాళీ ప్రతిష్టాత్మక దులీప్ ట్రోఫీని మయాంక్ అగర్వాల్ సారథ్యంలోని ఇండియా 'ఏ' దక్కించుకుంది. ఆట ఆఖరి రోజు 350 పరుగుల ఛేదనలో ఇండియా 'సీ'.. 217 పరుగులకు కుప్పకూలడంతో అగర్వాల్ సేన 132 పరుగుల తేడాతో విజయం సాధించింది. సాయి సుదర్శన్ (111) పోరాడినా 'సీ'కి పరాభవం తప్పలేదు. ప్రసిధ్ (3/50), తనుష్ (3/47) రాణించారు. మూడింటిలో రెండు మ్యాచ్‌లు గెలిచిన 'ఏ'.. 12 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా 'సీ' 9 పాయింట్లతో రన్నర్‌గా నిలిచింది.

ప్రతి జిల్లాకూ ప్రాతినిధ్యం ఉండాలి

టీడీసీఏ అధ్యక్షుడు అల్లీపురం వెంకటేశ్వర రెడ్డి

హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణ రాష్ట్రంలో క్రికెట్ అభివృద్ధి చెందాలంటే ప్రతి జిల్లాకూ అధునాతన మౌలిక సదుపాయాలతో కూడిన అకాడమీలు అవసరమని, రాష్ట్ర జట్టు అంటే అన్ని జిల్లాల నుంచి క్రికెటర్లకు ప్రాతినిధ్యం ఉండాలని తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం (టీడీసీఏ) అధ్యక్షుడు, శాట్ మాజీ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర రెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ మేరకు ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన 'తెలంగాణ క్రికెట్ దశ-దిశ' రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో గ్రామీణ క్రికెట్ సరైన ఆదరణను నోచుకోలేదని, రాష్ట్ర క్రికెట్ జట్టు అంటే ప్రతి జిల్లాకూ ప్రాతినిధ్యం ఉండేలా టీడీసీఏ తరపున రాజీలేని కృషి చేస్తామని తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన శాట్ చైర్మన్ కే. శివసేనా రెడ్డి మాట్లాడుతూ.. 'రాష్ట్రంలో గ్రామీణ క్రికెట్ కుంటుపడింది. జిల్లాల్లో క్రికెట్ అభివృద్ధికి టీడీసీఏ సంకల్పం తీసుకోవడం ఆహ్వానించదగ్గ పరిణామం' అని అన్నారు.